

# పడగ నీడ

-కె.వి.వి. సత్యనారాయణరాజు

"...'**ఆడి** సేతులు నరికేత్తాను. ఆడు గొప్పోడయితే ఎవడి క్కావాలి? మీ కెవరికీ దమ్ము ల్లేవురా. నవట నా కొడుకులు మీ రంతా. ఆడేం సెపితే అది ఇని సిగ్గులేని యదవల్లా తలొంచు కొచ్చేత్తార్రా మీరు. అందుకే, నా కొడకుల్లారా! మీ కెన్నిసార్లు చెప్పాను—ఆ నా కొడుకు మాట ఇంటే యద్రనులేకుండా పోతార్రా అని? అయినా మీకు గేనం లేదురా. అందుకే ఈ రాత్రికే మువ్వూర్తం పెట్టాను... ఆడి సేతులు నరకడానికి. అప్పుడు గాని తెలిసి రాదు ఈ తంగవేలు తడాకా!'...నరిగ్గా, ఇలాగే అన్నాడండీ."

అంతవరకూ విన్న మేనేజర్ మొహంలో కోపం వ్యక్తమయింది. ఈ మాటలు మేనేజర్ రంగనాథానికి వప్పచెప్పిన వాడి పేరు ఆనందరావు. రంగనాథం నమ్మినబంటు అతను. రంగనాథం అభిమానం మరింత సంపాదించుకోవటం కోసం—ఉన్నదానికి మరి కాస్త చేర్చి చెప్పా డనుకోవడానికి వీల్లేదు. గతంలో తన విశ్వాసం చాలా సందర్భాల్లో నిరూపించుకున్నాడు ఆనందరావు. కట్టుకున్న పెళ్ళామయినా సమయానుకూలంగా అబద్ధం ఆడుతుందేమో గాని, ఆనందరావు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క అక్షరంకూడా తనను వంచించడానికి చెప్పడని రంగనాథం నమ్మకం.

రంగనాథం ఆలోచించాడు. లేబర్ ఓరియంటెడ్ జాబ్స్‌లో స్ట్రైక్‌లూ, ఘెరావ్‌లూ మామూ లే. కాని, ప్రత్యేకంగా ఒక వ్యక్తి చేతులూ, కాళ్ళూ తీ సేస్తాను అనేంత వరకూ వెళ్ళాడంటే ఇది పెద్ద విషయమే. అందునా తంగవేలు లేబర్ యూనియన్ లీడర్. మొత్తం లేబర్‌కి అతని మాట వేదం. రంగనాథం కంట్రోల్‌లో ఉన్న ఎ స్టేట్‌లోని ఒక డివిజన్‌లో లేబర్ అతను. లేబర్ మీద సూపర్‌వైజర్లుగా పని చే సేవాళ్ళు కూడా ఒకప్పుడు లేబర్‌గా పని చేసినవాళ్ళే. వాళ్ళవల్ల యాజమాన్యానికి పెద్దగా ప్రయోజన ముండదు. కాకపోతే వాళ్ళే తాము మేనేజ్‌మెంట్ పక్షమే అని నటిస్తా రంతే.

"సర్! మీరూ, అమ్మగారూ కొంతకాలం ఎ స్టేట్ విడిచి ఈ గొడవ తగ్గేవరకూ బయటకు వెళితే బాగుంటుందేమో!"

ఆలోచనల్లోంచి బయట పడ్డాడు రంగనాథం. ఆనందరావు మాటలు విని. "ఇట్సాల్ రైట్. ఆనంద్, నాకేం ఫర్వాలేదు. నువ్వు వెళ్ళిరా."

ఆనందరావ్ ఏదో చెప్పబోయి. రంగనాథం మాటల్లోని నిశ్చలతను చూసి ఆగిపోయాడు.

ఆనందరావు వెళ్ళాక పోర్టికోలో ఉన్న కారు దగ్గరకు వచ్చాడు రంగనాథం. తనను చూసి డ్రైవర్ బాక్ డోర్ తీయబోతుంటే కళ్ళతోనే వారించి—"నువ్వు ఇంటికి వెళ్ళు" అన్నాడు.

ఫ్రంట్ సీటులో కూర్చుని. కారు స్టార్ట్ చేసి కిండర్లీ డివిజన్‌వైపు పోనిచ్చాడు. కారు ఎ స్టేట్ ఆఫీసు దాటి. లేబర్ క్వార్టర్స్ ప్రక్కగా ప్రయాణించి ఒకచోట ఆగింది. తంగవేలు ఇంటిముందు ఆగిన మేనేజర్‌గారి కారును చూసి చుట్టు ప్రక్కల ఉన్న లేబర్‌కు కలిగిన ఆశ్చర్యం అనంతం. అదే కాకుండా ఆ ఉదయమే తంగవేలు రంగనాథం చేతులు నరికేస్తానని శపథం చేశాడు. ఈ విషయం దొరగారికి తెలిసిపోయిందేమో? ఈ రోజుతో తంగవేలు పని సరి అనుకున్నారు.

ఇంతలో తంగవేలు కారు దగ్గరకి వచ్చి నిర్లక్ష్యంగా చూశాడు రంగనాథంవైపు.

తంగవేలు కళ్ళలోకి చూస్తూ అన్నాడు రంగనాథం—"తంగవేలూ! నీతో మాట్లాడాలి. రా... కారెక్కు."


తంగవేలుతో పాటు ఇంకా చుట్టుపక్కల ఉన్న వారందరికీ మతిపోయింది ఒక్క క్షణం. రంగనాథం తన కోలీగ్స్‌లో ఎవరినీ కూడా తన కారు ఎక్కించడు. ఒక సామాన్య లేబర్‌ని కా రెక్కమని అంటున్నా డంటే విషయం ఏమయి ఉంటుంది? తంగవేలు ఇలా ఆలోచిస్తున్న సమయంలో రంగనాథం ఫ్రంట్ సీట్లో నుంచి. వెనక్కి చేయి చాపి బాక్ డోర్ అన్‌లాక్ చేయడం. యాంత్రికంగా తంగవేలు కార్లో కూర్చోవడం జరిగిపోయాయి. మరు నిమిషంలో కారు రంగనాథం బంగళా ముందు ఆగింది.

"దిగు, తంగవేలూ!"

తంగవేలు నోట మాట రావడం లేదు.

"చూడు, తంగవేలూ! ఈ రోజు నా కో వార్త అందింది." తంగవేలు మొహంలోకి చూస్తు అన్నాడు రంగనాథం.

'కొంపదీసి తను చేసిన శపథం తెలిసిపోలేదు కదా?' తంగవేలు ఉలిక్కిపడి. అంతలోనే సర్దుకొన్నాడు. అయినా. తన కేమిటి భయం?




లేబర్ అంతా తన వెనుక ఉన్నారు.

"మన ఎస్టేట్‌లో పని చేసే వ్యక్తి ఒకతను నా మీద కత్తి గట్టాడు. నన్ను చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయం నేను నమ్మలేదనుకో! అయినా, నా జాగ్రత్తలో నేను ఉండాలి కదా?"

'ఇంకేం జాగ్రత్తలే? ఇవాళ్టితో నీ పని సరి. నీ పని అయ్యాక నీ కీ విషయం ముందుగా చేరేసిన నా కొడుక్కి కూడా నూకలు తీరిపోతాయి' అనుకున్నాడు తంగవేలు.

"నే నేం ఆలోచించానంటే—నిన్ను దాదాపు రెండు సంవత్సరాల నుంచి, అంటే నే నిక్కడకు వచ్చినప్పటినుంచీ చూస్తున్నాను. నువ్వు కష్టపడి పని చేస్తావు. లేబర్ గొడవలన్నీ నీ నెత్తిన వేసుకొని మేనేజ్‌మెంట్‌కు పెద్ద అవుతున్నావు. నీ కష్టానికి, విశ్వాసానికి తగిన పని ఇవ్వాలని నా కెప్పటినుంచో ఉంది. ఇవాళ్టినుంచి నా బంగాళాలో వాచ్‌మేన్‌గా ఉండు. హాయిగా బ్రతకవచ్చు. నీ పనల్లా నన్ను క్షేమంగా చూసుకోవటమే. పేరుకి బంగళా వాచ్‌మేన్ గాని, నాకు బాడీగార్డ్ లాంటివాడివి ఈ రోజు నుంచీ." తను చెప్పవలసింది పూర్తి చేశాడు రంగనాథం.

తంగవేలుకు తను కలగంటున్నాడేమో నని అనుమానం వచ్చింది. లేబర్‌కి బోనస్ విషయంలో అన్యాయం చేస్తున్నాడని రంగనాథాన్ని చంపేస్తానని లేబర్‌ముందు శపథం చేశాడు తను. అందువల్ల తనకు ఒరిగే దేమిటి? తను అరిచి అల్లరి చేస్తే తనతో పాటే అందరూ లాభం పొందుతారు. తనకు కష్టం వస్తే ఆదుకొనేవాళ్ళెంతమంది ఉంటారు వీళ్ళలో? అందుకే తన బాగు తను చూసుకొంటే అన్ని విధాలా మంచిది. దొరగారి దగ్గర ఏ పని చేసినా ఆ విలువే వేరు ఇలా ఆలోచించి అన్నాడు తంగవేలు—"చాల సంతోషం, దొరా! మీ మీద ఈగ వాలితే అది చచ్చిందన్న మాటే." తనే రంగనాథాన్ని తిట్టినట్టుగా అతనికి తెలియదన్న అజ్ఞానంలో ఉన్నాడు తంగవేలు.

తంగవేలు మాటలు విని రంగనాథం చిరునవ్వు నవ్వాడు. "నాకు తెలును, తంగవేలూ, నువ్వు దగ్గరుంటే నా కేమీ ఫర్వాలేదని. అందుకే నిన్ను ప్రత్యేకంగా తీసుకొచ్చాను ఇక్కడికి."

"దండాలు, దొరా, వత్తాను మరి!"

"ఎక్కడికి వెళ్తావు, తంగవేలూ, ఇవ్వాళ్టికి ఇక్కడే భోజనం చేసి ఉండిపో. రేపటినుంచి నీ మకాం కూడా నా బంగళా ప్రక్కనే."

దొరగా రింట్లో భోజనం! దొరగారి బంగళా ప్రక్కన నివాసం!! నోట మాట రాలేదు తంగవేలుకి. ఈ రోజు కెలాగూ వీలు కాదు; రేప్పొద్దుటే పీకలదాకా తాగెయ్యాలి అనుకున్నాడు తంగవేలు.

** ** **

ఆరు నెలలు గడిచాయి. తంగవేలు బాగా పుష్టి చేశాడు. వాడి కే చీకూ, చింతా లేదు ప్రస్తుతం. ఏ రకమైన మానసిక వ్యథలూ లేకుండా దొరగా రింట్లో మిగిలిన తిండి తిని నిగనిగ లాడుతున్నాడు.

తంగవేలుకు ఎప్పుడయినా అంతకుముందు వాడితో కలసి పని చేసిన లేబర్ కనిపిస్తే, వాళ్ళెవరో తనకు తెలియనట్లే ప్రవర్తిస్తున్నాడు. దానికి కారణముంది.

కొద్ది రోజుల క్రితం మాటల్లో రంగనాథం అన్నాడు—"నువ్వు నా దగ్గర చేరిన తరువాత నాకు చాలా మనఃశ్శాంతిగా ఉంది. నీలాంటి వాచ్‌మేన్ ఇంకొకడు ఈ జన్మలో దొరుకుతాడని నమ్మకం లేదు. కానీ, ఇంత విశ్వాసం గలవాడివి, తెలివైనవాడివి నీ జీవితమంతా నాకు వాచ్‌మన్‌గా పని చేస్తూ గడిపేయడం ఊహించుకుంటే నాకే బాధగా ఉంది. త్వరలోనే నిన్ను లేబర్‌మీద సూపర్‌వైజర్‌గా వేయాలని అనుకుంటున్నాను. మీ వాళ్ళు ఎవరైనా ఉంటే చెప్పు... వాళ్ళకు వాచ్‌మేన్ పని అప్పగించి నిన్ను సూపర్‌వైజర్‌గా నియమిస్తాను."

ఇదంతా విన్న తరువాత తంగవేలుకు తన ఆనందం ఎలా వ్యక్తం చేయాలో అర్థం కాలేదు. నిజంగా ఎంత మంచి వాడీయన? తన బాగు తాను చూసే అధికారులను చూశాడు గాని, మరీ ఇంత మంచి మనుషులు అధికారులలో ఉంటారని కలలోనైనా ఊహించలేదు తంగవేలు. కళ్ళలో నీళ్ళు తిరుగుతూండగా రెండు చేతులూ జోడించి అన్నాడు—"తమ దయ, దొరా!"

అప్పటినుంచే అంతకుముందు తనతో కలసి పని చేసిన లేబర్ కనిపించినా, వాళ్ళను సాధ్యమైనంత వరకూ తప్పించుకొని తిరగడం మొదలు పెట్టాడు. తన మీద నమ్మకం ఉంచి దొరగారు తనని సూపర్‌వైజర్ చేయాలని చూస్తూ ఉంటే తను లేబర్‌తో చనువుగా ఉంటే రేపు వాళ్ళ నేం కంట్రోల్ చేయగలడు? ఈ కూలీ వెధవల్ని దగ్గరకు చేరనీయకూడదు అని గట్టిగా తీర్మానించుకున్నాడు తంగవేలు, తనూ ఒకప్పుడు కూలీగా పని చేసిన వాడిననే విషయం పూర్తిగా మరచిపోయాడు.

తంగవేలు ఎదురు చూసే రోజు రానే వచ్చింది. ఒక శుభోదయాన రంగనాథం తంగవేలును పిలిచి చెప్పాడు—"నిన్ను ఈ రోజునుంచీ సూపర్‌వైజర్‌గా నియమిస్తున్నాను. ఇంతవరకూ నా బంగళా వాచ్‌మేన్‌గా ఉండి నా విశ్వాసం సంపాదించావు. నీ కిచ్చిన ఈ కొత్త ఉద్యోగం కూడా అంతకంటే సమర్థవంతంగా నిర్వహించగలవన్న నా నమ్మకాన్ని వమ్ము చేయవన్న నమ్మకం నాకుంది" అంటూ భుజం తట్టాడు.

తంగవేలు ఒళ్ళంతా పులకరించింది. కళ్ళలో నీళ్ళు ఉబికాయి. నిల్చున్నచోటే కూలబడిపోయి రంగనాథం పాదాలు అందుకున్నాడు.

** ** **

సుమారు ఒక సంవత్సరం తర్వాత రంగనాథం తన ఆఫీసులో కూర్చుని ఉండగా ఒక వ్యక్తి వచ్చాడు. అతని మొహంలో అసహనం, ఆత్రుత, కోపం ఉన్నాయి. అడుగుల చప్పుడు విని తలపైకి ఎత్తాడు రంగనాథం. ఆ వచ్చిన వ్యక్తి కృష్ణమోహన్. అతని ముఖకవళికలు గమనించాక రంగనాథం ఊహించాడు—అత నొచ్చిన పనేమిటో? కృష్ణమోహన్ రంగనాథం క్రింద ఫీల్డ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు: అతను మేనేజింగ్ డైరక్టర్ రికమండ్ చేసిన కాండిడేట్. మనిషిలో సత్తా లేదు. పనిమీద శ్రద్ధ లేదు. చిన్న చిన్న సమస్యలను కూడా సాల్వ్ చేసే తెలివితేటలు లేవు. తంగవేలు కృష్ణమోహన్ క్రింద సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. తంగవేలు లేబర్ కేడర్‌నుంచి పైకి ఎదిగిన వ్యక్తి కనుక పని చేసే విధానం, చేయించే విధానం రెండూ తెలును అతనికి. సబార్డినేట్ పై ఆఫీసర్ కంటే తెలివైనవాడయి, ఆ తెలివితేటలు తరచూ వ్యక్తం చేస్తూ ఉంటే సహజంగా ఆ ఇద్దరి మధ్య సఖ్యత ఉండదు. అదే ఇక్కడ జరిగి ఉంటుందని ఊహించి కృష్ణమోహన్‌కు కుర్చీ చూపించాడు.

తన మనసులోని లావా బయటకు వెళ్ళగక్కాలని ఉన్నాడేమో కృష్ణమోహన్ కూర్చోకుండా నించొనే మాట్లాడాడు—"తంగవేలు పరిస్థితి ఏమీ బాగాలేదు, సార్! అతని పైవాడినన్న గౌరవం లేకుండా లేబర్ ముందు నన్ను చులకన చేస్తున్నాడు. ఇన్నాళ్ళ నుంచీ అతని ఆగడాలను భరించాను, మీరే స్వయంగా అతన్ని అపాయింట్ చేయడం వలన. కానీ, అతను హద్దులు మీరాడు. ఎస్టేట్‌లో ఏ పని ఎలా చేయించాలో నాకు ఏమీ తెలియదని, తను తలచుకొంటే రేపు ఇదే సమయానికి నా ఉద్యోగం తీయించేస్తానని ఎంతో అవమానకరంగా లేబర్‌ముందు మాట్లాడాడు. ఇది నేను ఎంత మాత్రమూ సహించలేను. మీకు అతని ప్రవర్తన నచ్చితే నచ్చవచ్చు. కానీ, అతను నన్ను ఇలా నలుగురుముందూ నిలదీస్తుంటే మీరు ఏమీ పట్టనట్టు ఊరుకోవడం నాకు ఎంత మాత్రమూ నచ్చలేదు. మీరు ఏక్షన్ తీసుకొంటే సరేసరి... లేకపోతే ఎమ్.డి. దగ్గరకు నేనే వెళ్ళవలసి ఉంటుంది."

రంగనాథం మొహంలో కోపం తొంగి చూసింది. "సీ మిస్టర్ కృష్ణమోహన్! ఈ విషయాలన్నీ నువ్వు నాకు ఇప్పుడే రిపోర్టు చేస్తున్నావు. ఇంత వరకూ నాకు రిపోర్టు చేయకుండా

ఉండటం నీ మొదటి తప్పు. నీ కంప్లెయింట్ విని, నే నేమంటానో వినకుండా నీ మనసులోని మాటలన్నీ నాకు ఆపాదించి ఒన్ వేగా మాట్లాడటం, ఎమ్.డి.ని కలుస్తానని బెదిరింపుగా మాట్లాడటం రెండో తప్పు. నీ కంప్లెయింట్ వివరంగా వ్రాసి ఆఫీసులో సబ్మిట్ చేయి. ఒకటి రెండు రోజుల్లో ఎంక్వైరీ జరుగుతుంది. ఈలోగా సాక్ష్యాధారాలు సంపాదించుకునే ప్రయత్నంలో ఉండు. ఎంక్వైరీ తరువాత చూస్తాను ఏం చేయాలో!" చెప్పవలసింది స్పష్టంగా చెప్పాక కృష్ణమోహన్ మీద నుంచి దృష్టి మరల్చాడు టేబుల్ మీద ఉన్న ఫైల్స్ వైపు.

ఆ రోజు రాత్రి ఏడు గంటలకు రంగనాథం బంగళాలో అతను కూర్చున్న కుర్చీకి ఎదురుగా చేతులు కట్టుకొని వినయంగా నిలబడి ఉన్నాడు తంగవేలు. "అదీ జరిగిన ఇసయం, దొరా! ఆడి పొగరు దించాలని లేబర్ ఎదురుగా మీరు సెప్పినట్టే ఆడ్ని నానా బూతులు తిట్టాను, దొరా! అంతే కాకుండా ఆడు మల్లీ మాట్టాడితే ఉజ్జోగం తీయించే గలనని బెదిరించాను, దొరా! అంతా మీరు సెప్పినట్టే సేశాను, దొరా!"

రంగనాథం మొహంలో నవ్వు వ్యక్త మయింది. "వెరీ గుడ్, తంగవేలూ! అతన్ని రేపు పిలిపించి ఎంక్వైరీ జరిపిస్తాను. అతను కంప్లెయింట్ చేసినప్పుడు యాక్షన్ తీసుకోక పోతే అంతా నేను నిన్ను గుడ్డిగా సమర్థిస్తున్నా ననుకుంటారు. నీ కొచ్చిన భయం ఏమీ లేదు. ఇప్పుడు నాతో చెప్పిన విషయమే అందరి ముందూ నిర్భయంగా చెప్పు. అతనికి పని చేయించడం రాక నిన్ను తప్పు దోవ పట్టిస్తోంటే నువ్వు సహించలేక అతన్ని తిట్టావని చెప్పు. మిగిలిన విషయం నేను చూసుకొంటాను."

"వత్తాను, దొరా." శెలవు తీసుకున్నాడు తంగవేలు.

** ** **


ఎ స్టేట్ ఆఫీసులో ఎంక్వైరీ రూమ్‌లో రంగనాథంతో పాటు అతని స్టెనో గ్రాఫరూ, స్టాఫ్ యూనియన్ సెక్రటరీ రాంప్రసాద్ కూర్చొని ఉన్నారు. తంగవేలు, కృష్ణమోహన్ అదే రూమ్‌లో కొంచెం దూరంలో చెరొక కుర్చీలో కూర్చొని ఉన్నారు. ఎంక్వైరీ రూమ్ బయట నలుగురైదుగురు లేబర్ నించొని ఉన్నారు.

కృష్ణమోహన్ ఇచ్చిన రిపోర్టు పైకి చదివాడు రంగనాథం. చదవడం పూర్తయ్యాక తంగవేలును ఉద్దేశించి అన్నాడు! "నువ్వు చెప్పుకోవలసింది ఏమైనా ఉందా?"

తనని లేబర్ ముందు తిట్టిన విషయం తంగవేలు ఒప్పుకోడనే అనుమానంతో గొడవ జరిగిన సమయంలో ఎ స్టేట్‌లో ఉన్న లేబర్‌లో నలుగురిని ఎంపిక చేసి తీసుకొచ్చాడు కృష్ణమోహన్ తనకు సాక్ష్యంగా. ఎంక్వైరీ రూమ్ ముందుకు రాగానే అర్థమయింది, తంగవేలుకు ఆ విషయం అక్కడున్న లేబర్‌ను చూడగానే. అయినా, తనకు భయమేముంది? తను అక్షరాలా రంగనాథం చెప్పినట్టే చేశాడు. గొంతు సవరించుకొని అన్నాడు తంగవేలు: "ఏం లేదు, దొరా! ఈడిని నేను తిట్టడం నిజమే. ఇటువంటోడ్ని అడ్డూ అపూలేకుండా వదిలేస్తే ఎ స్టేట్ నాల్రోజుల్లో తగలెట్టేయగలడు. అందుకే ఈడిని మీ అందరి తరపునా నేనే తిట్టాను. ఈడు నక్కలాటోడు. మీలాటోళ్ళు ఈడ్ని మొహం మీద తిట్టలేరు గదా? ఈడు చేసిన ఎదవపని గురించి మీరు పిల్చి అడిగితే తప్పుకు పోయే తెలివి తేటలు ఈడికున్నాయి. మీరు కాగితం మీద రాసి ఈడికి వార్నింగిచ్చినా, అదేం పట్టించుకోడు. దున్నపోతు చర్మం ఈడిది. ఇంటువంటోడ్ని పది మంది ముందు తిడితేగాని బుద్ధొచ్చి వల్లు దగ్గరెట్టుకుని పని చేయడు. అందుకే అడ్డమైన బూతులూ తిట్టాను. నోర్మూసుకొని పడుండక సిగ్గు లేకుండా మీతో రిపోర్టు చేశాడు." తను చెప్పవలసింది పూర్తి చేసి రంగనాథం మొహంలోకి చూశాడు తంగవేలు. తనాశించిన మెరుపు రంగనాథం మొహంలో కనబడక పోవటంతో ఒక్క క్షణం ఉలిక్కిపడి అంతలోనే తమాయించు కున్నాడు. ఇది ఎంక్వైరీ కదా... నవ్వు మొహంతో ఎలా ఉంటాడు దొర? కోర్టులో జడ్జీగారు నవ్వగా తనెప్పుడూ చూడలేదు. ఇక్కడా యనే జడ్జీ కాబట్టి అలా గంటు మొహం వేసుక్కూర్చున్నాడు.

తంగవేలు తనంతట తానే ఒప్పుకోవడంతో సాక్ష్యానికి పిలిచిన నలుగురు మనుషుల్నీ పంపించేశాడు. తన తరపున సాక్ష్యం చెపితే డబ్బు బాగా ముట్ట చెపుతా నన్నాడు కృష్ణమోహన్. కానీ తమని ఎవరూ సాక్ష్యం చెప్పమని అడగకుండానే విషయం ముగిసి పోవడంతో తమకు రాబోయే డబ్బు చేయి జారిపోయినట్టయి బాధగా వెళ్ళిపో


గృహిణుల
ఆదరాభిమానాలు అందుకొన్న
శాంత టిల్టింగ్ వెట్ గ్రైండర్



santha



ధృఢమైన మోటారుతో పని చేస్తుంది.
నిశ్శబ్దమైన చలనం, 11-12 నిమిషాలలో పిండి
తయారీ, శుభ్రపరచడం ఎంతో తేలిక,
ఆకర్షణీయమైన రంగులలో 1 లీటరు,
1½ లీటరు, 2 లీటర్ల సైజులలో
అన్ని పట్టణములందు లభించును.

SUVARNA/PUSHPA

కంపెనీ బ్రాంచి ఆఫీస్:
SANTHA INDUSTRIALS
2-146/3 PATAMATA
OPP. DURGAMAHAL VIJAYAWADA-6
OUR SERVICE IS PROMPT. DO NOT INSURE IT.



# రోగాలవిముక్తికి

**ఐదువైద్యవిధానాలు:-** ప్రతివైద్యవిధానంలోను కొన్ని రోగాలనివారణకు ప్రత్యేకత ఉంది. ఈపుస్తకంలో, వచ్చింది ఏరోగమో తెలుసుకోవటానికి, ప్రతిరోగానికి రోగలక్షణాలు, వాటినివారణకు, అనుభవంగల 5 రకాలడాక్టర్లు చెప్పిన, అల్లోపతి, ఆయుర్వేద, ప్రకృతి, మూలిక, హోమియో మందుల వివరాలు, 427 రోగాలకున్నాయి. విధానాలన్నీ తెలుసుకొంటే మీకిష్టమైంది అనుసరించవచ్చును. వెల రూ.30.

**ఆహారవైద్యము:-** మనరోగాలను నయంచేసుకోవటానికి కావలసిన మందులన్నీ మనంతినే పండ్లు, దుంపలు, కాయగూరల్లో సహజంగానేఉన్నాయి. ప్రకృతివైద్యులు, ఏరోగానికేమి తినాలో తెల్పిన పూర్తి వివరాలన్నీ యీపుస్తకంలో ఉన్నాయి. వెల రూ. 15-00

**మూలికావైద్యము:-** ఇంట్లోదొరికే మిరియాలు, అల్లం, జీలకర్ర మొదలైన మూలికలతో వివిధరోగాలవిముక్తికి, అనుభవంగలవారు చెప్పిన ఖర్చులేని ఎన్నోమంచి మార్గాలు, పూర్వకాలంనుంచి వాడుకలోఉన్నవి యిందులోఉన్నాయి. రూ.15.

తరుచువచ్చే రోగాలకయ్యే విపరీత ఖర్చు తగ్గించటానికి, పై3 తెలుగుపుస్తకాలు మీకు చాలా ఉపయోగం. అవసరమొచ్చినపుడు ఆదుకొంటాయి. ప్రతియింటా ఉండతగినవి. ఈ3 పుస్తకాలు రూ.60 కే పంపబడును. విడిగా పోష్టుఖర్చు రూ. 7 అదనము. వీటిలో ఏరెండుపుస్తకాలకైనా వి.పి.పోష్టుఖర్చులు ఉచితము.

దేశసేవప్రచురణాలు, ప్లాటు నెం.2, ఇందిరానగరు, వెంగళరావునగరు ఓవరుహెడ్ వాటరుటాంకుసమీపాన, హైదరాబాదు-500890 కు ఉత్తరంవ్రాస్తే మీకుకావలసిన పుస్తకాలు వి.పి. పోష్టుద్వారా పంపబడును. మీకెంతో ఉపయోగించేవీటికొరకు అశ్రద్ధచేయకుండావెంటనేవ్రాయండి.

యారు వాళ్ళు. కృష్ణమోహన్ ఇది కలా, నిజమా అని చూస్తున్నాడు. తంగవేలు ఒప్పుకుంటాడని అతను ఎంత మాత్రమూ అనుకోలేదు.

స్టాఫ్ యూనియన్ సెక్రటరీకి ఈ ఎంక్వైరీ ఎంత మాత్రమూ అర్థం కాలేదు. అతను స్టాఫ్ కోర్కెలకు చాలా ఎంక్వైరీల్లో పాల్గొన్నాడు కానీ, ఇంత వన్‌వేగా ఆర్గ్యుమెంట్స్ లేకుండా ముగిసిన ఎంక్వైరీ అతను చూసి ఉండలేదు.

అందరి ముఖాల్లోకి చూసి అన్నాడు రంగనాథం: "తన పై అధికారిని అర్థరహితంగా లేబర్ ముందు అశ్లీల పదజాలం ప్రయోగించి అవమాన పరిచినందుకు తంగవేలును డిస్మిస్ చేస్తున్నాను. రేపు అతను ఆఫీసుకు వచ్చి అతనికి రావలసిన డబ్బు తీసుకొని, ఎస్టేట్ విడిచి వెళ్ళి పోవచ్చు."

రంగనాథం మాటల్ని వింటున్న తంగవేలు ఉలిక్కి పడ్డాడు. ఇదేమిటి? తనను ఉద్యోగంలో నుంచి తీసేశారా? మనసులోని అల్లకల్లోలాన్ని అదుపులో పెట్టుకొని అడిగాడు: "నేనేం పాపం చేశాను, సార్! మీరు ఆడ్ని నలుగురి ముందు తిట్టమన్నారు గనక తిట్టాను, లేపోతే ఆడు పని చేత్తే నా కెందుకు, చెయ్యకపోతే నా కొచ్చిన నష్టమేమిటి?"

రంగనాథం కళ్ళు పెద్దవి చేసి అన్నాడు: "నువ్వేం మాట్లాడుతున్నావు, తంగవేలూ! నేను నీతో కృష్ణమోహన్‌ను తిట్టమని చెప్పానా? అతనిని తిట్టవలసిన అవసరం నాకేం వచ్చింది? నాకు అతని ప్రవర్తన నచ్చకపోతే అతనికి ఎలా చెప్పుకోవాలో కూడా తెలియకుండానే ఈ ఉద్యోగం ఇంత కాలం నుంచీ చేస్తున్నా నంటావా? అయినా, నేను నీపై అధికారిని నీతో తిట్టించడమేమిటి?"

తంగవేలు మొదటి సారిగా రంగనాథం తనను వాచ్‌మేన్‌గా అపాయింట్ చేసినపుడు ఎంత ఆశ్చర్య పడ్డాడో... దానికి పది రెట్లు ఆశ్చర్యాన్ని అనుభవించాడు ఆ క్షణంలో. కాకపోతే అప్పటి ఆశ్చర్యంలో ఆనందం ఉంటే, ఇప్పటి పరిస్థితులో అనుమానం, అసహ్యం, కోపం మిళితమై ఉన్నాయి.

తంగవేలు నోట మాట రాక పోవటంతో రంగనాథం తిరిగి అన్నాడు, మిగిలిన వాళ్ళ వైపు చూస్తూ: "తంగవేలు చేసిన ఈ అభియోగం నమ్మశక్యంగా అనిపిస్తోందా మీకు??"

అంతా అడ్డంగా తల లూపారు.

"దట్సాల్!" అంటూ లేచాడు రంగనాథం.

**  **

మరునాడు రంగనాథం తన బంగళా ముందు పడక కుర్చీలో వాలి పైప్ కాల్చుకుంటూ, పేపర్ చదువుకుంటున్నాడు. గేటు దగ్గర ఘర్షణ విని తల పైకెత్తాడు. గూర్ఖాతో ఘర్షణ పడుతున్న తంగవేలు కనిపించాడు. రంగనాథం మొహంలో క్రూరమైన నవ్వు కదలాడింది. "విజయ్ సింగ్! ఉన్‌కో అందర్ ఆనేదో!" అన్నాడు.

తంగవేలు ఒక్కో అడుగూ నెమ్మదిగా వేసుకుంటూ రంగనాథం దగ్గరగా వచ్చాడు. అతని కళ్ళలో దీనత్వం ఉంది. ఒక్క రోజులో పది లంఖణాలు చేసిన వాడిలా అయిపోయాడు.

"ఏం ఇలా... వచ్చావు, తంగవేలూ?" రంగనాథం ఏమీ జరుగనట్టే అతి సాధారణంగా అడిగాడు.

తంగవేలు గొంతు సవరించు కొన్నాడు—"మీరు ఇంత మోసం చేత్తారను కోలేదు, దొరా! మిమ్మల్నే నమ్ముకొని మీరు చెప్పిన పని చేసినందుకు మీరు నాకిచ్చే బగుమానం ఇదేనా?!"

రంగనాథం కళ్ళు ఎరుపెక్కాయి. మొహంలోని నరాలు బిగుసుకున్నాయి. "సరిగ్గా సంవత్సరమున్నర క్రితం నువ్వేమన్నావో గుర్తుందా? నీకు గుర్తుండి ఉండదు. అప్పట్లో నువ్వే లేబర్ యూనియన్ లీడర్‌వి కదూ! ఈ సంవత్సరమున్నర కాలంలో నీ స్టేటస్ పెరిగింది కనుక అప్పుడు నువ్వు అన్న మాటల్ని మరచిపోయి ఉంటావు. కానీ, నా కింకా గుర్తుంది. నా చేతుల్ని నరికేస్తానని శపథం చేశావు. నిన్ను దువ్వి నీ కో శాశ్వతమైన నీడ చూపించగానే నీ శపథం మరచి పోయావు. నువ్వు ఏం చేస్తున్నావో నీకు తెలియలేదు ఇన్నాళ్ళూ. కేవలం నేను చెప్పిన పనులు చేసి చేసి శారీరకంగా తప్ప మానసికంగా నువ్వు చచ్చిపోయావు. సరిగ్గా నేను ఆశించినట్టే ప్రవర్తించావు. ఈ రోజు నువ్వు ఎంత బాధపడి మాత్రం ఏం ప్రయోజనం? ఈ బుద్ధి నీకు ఇంతకు ముందే ఉంటే బాగుండేది." వ్యంగ్యంగా అన్నాడు రంగనాథం.

తంగవేలుకు త్రాచు పాము గుర్తుకు వచ్చింది. పాము పగ ఆరు నెల లుంటుందట. కానీ ఈ రంగనాథం త్రాచుపాము కన్నా ప్రమాదకరమైన వాడు. తనను నమ్మించి, అందలం ఎక్కించి ఒక్కసారిగా అధఃపాతాళానికి తోసేశాడు. తను వీడి చేతులు నరికేస్తానని బెదిరించినపుడే ఆ పని చేసి ఉంటే తనకు లేబర్ సపోర్టు లభించి ఉండేది. అప్పట్లో లేబర్‌కు తనంటే గురి. తన మాటే వేదం. కాని, రంగనాథం దగ్గర చేరిన ఈ సంవత్సన్నర కాలంలోనూ తను తోడివాళ్ళను నిర్లక్ష్యం చేశాడు. వాళ్ళను అవమానపరిచాడు. ఇవన్నీ కాకుండా రంగనాథం మాటల్ని గుడ్డిగా నమ్మి తన పై అధికారిని దుర్భాషలాడాడు. వీటన్నిటికీ తోడు తనే తిట్టినట్టుగా ఎంక్వైరీలో ఒప్పుకున్నాడు. తనను ఇక ఎవరూ కాపాడలేరు. లేబర్‌లో తనకు సపోర్ట్ ఎంత మాత్రమూ లేదు ప్రస్తుతం. స్టాఫ్‌తో విరోధం తెచ్చుకొన్నాడు. ఇవన్నీ ఆలోచించి అన్నాడు తంగవేలు: "నిన్ను గుడ్డిగా నమ్మినందుకు తగిన శాస్తి చేశావు. నీ తల అప్పుడే తెగేసి ఉంటే ఈ గొడవలన్నీ ఉండేవి కాదు. నిన్ను నమ్మి నీ ఆశ్రయాన్ని శాశ్వతమని భ్రమించి అందరికీ దూరమయ్యాను. నా వేలితో నా కన్నే పొడిచావ్. నేను చేసింది తప్పు అయినా, నీ కుచ్చితమైన బుద్ధికి మాత్రం ఏదో రోజు ఫలితం తప్పకుండా అనుబగిస్తావ్."

"నా సంగతి తర్వాత మాటాడుదువుగాని, ముందు నీ బ్రతుకేమిటో చూసుకో!" కరుగ్గా అని, గూర్ఖాను పిలిచి, "వీడిని బయటకు పంపించు" అన్నాడు.

తంగవేలు తన దగ్గరగా వస్తున్న గూర్ఖా వంక చూస్తూ జాలిగా అనుకున్నాడు మనసులో 'పాపం తన యజమాని నీడ శాశ్వతమని అనుకుంటున్నాడు. ఇది పడగనీడ అని త్వరలోనే వీడికి తెలుస్తుంది.'

*

## శబ్దించని చిత్రం

అప్పుడు
తలుపు తెరిస్తే
చివరంటా నువ్వులేని
దారి వుంది
కానీ-
ఎన్ని యిళ్ళని ప్రయాణించను?
ఎన్ని చెట్లని వసంతించను?
ఎన్ని పూలని ఉదయించను?

అప్పుడు
గొంతు విప్పితే
చివరంటా నువ్వులేని
రాగం వుంది
కానీ-
ఎన్ని శృతుల జీవించను?
ఎన్ని పల్లవుల పులకించను?
ఎన్ని పాటలను పుష్పించను?

అప్పుడు
బొమ్మ గీస్తే
చివరంటా నువ్వులేని
ఇంద్రధనుస్సుంది
కానీ-
ఎన్ని రంగుల పాడను?
ఎన్ని ఆకృతుల వెలిగించను?
ఎన్ని భావనల మీటను?

చంద్ర